ప్రజాశక్తి
www.prajasakti.com



## లడఖ్‌లో చైనా సైనికుడిని పట్టుకున్న భారత ఆర్మీ

**లడఖ్/న్యూఢిల్లీ :** లడఖ్‌లో చైనా సైనికుడిని పట్టుకున్నట్లు ఆర్మీ సోమవారం తెలిపింది. వాస్తవాధీనా రేఖ దాటి దేశంలోకి వచ్చిన సైనికుడు.. చుమర్-డేమ్‌చౌక్‌లో ప్రాంతంలో పట్టుబడ్డారని పేర్కొంది. కార్పొరల్ వాంగ్‌యా లాంగ్‌గా సైనికునిగా గుర్తించామని తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ప్రొటోకాల్‌నుసరించి చైనా ఆర్మీ..పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పిఎంఎ)కి సైన్యం అప్పగించనుందని ప్రకటనలో తెలిపింది. సదరు సైనికునికి ఆహారం, దుస్తులతో పాటు ఆక్సిజన్‌తో సహా వైద్య సహాయాన్ని అందిస్తున్నామని వెల్లడించింది. తప్పిపోయిన సైనికుడి ఆచూకీ గురించి చైనా ఆర్మీ నుండి అభ్యర్థన వచ్చిందని..ఫార్మాలిటీస్ పూర్తయ్యాక అతడిని చుషుల్-మోల్డో సమావేశ స్థలంలో ఆ దేశ అధికారులకు అప్పగిస్తామని పేర్కొంది.

## పసిడి దిగుమతుల్లో 57% పతనం

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1)లో భారత పసిడి దిగుమతులు 57 శాతం పతనమై 6.8 బిలియన్ డాలర్ల (రూ.50,658 కోట్లు)కు పరిమితమైనట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో 15.8 బిలియన్ డాలర్లు (రూ.1,10,259 కోట్లు) విలువ చేసే బంగారం దిగుమతి చోటు చేసుకుంది. గడిచిన క్యూ1లో వెండి దిగుమతులు 63.4 శాతం పతనమై రూ.5,543 కోట్లుగా నమోదయ్యాయి. కరోనా వైరస్ విజంభణతో ఖరీదైన లోహాలకు డిమాండ్ తగ్గడంతోనే బంగారం, వెండి దిగుమతులు భారీగా తగ్గాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## 26న రవాణా కార్మికుల సమ్మె

**న్యూఢిల్లీ :** రవాణా పరిశ్రమను, కార్మికుల జీవనోపాధిని రక్షించడానికి నవంబర్ 26న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కార్మికులకు అఖిల భారత రవాణా కార్మికుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ నెల 18న నేపాల్‌దేవ్ భట్టాచార్య, జనార్ధన్ పతి అధ్యక్షతన ఆన్‌లైన్‌లో జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో రవాణా పరిశ్రమ, కార్మికుల పరిస్థితిని సమీక్షించారు. కరోనా సమయంలోనూ డీజిల్, పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ. 16, రూ 13 పెంచడం రవాణా రంగం ప్రస్తుత సంక్షోభానికి కారణంగా తెలిపింది. దీనిని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. కార్మికులు, ముఖ్యంగా అసంఘటిత కార్మికులు తమ మనుగడ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.

## జీఎస్టీ రుణాన్ని రూ.1.83లక్షల కోట్లకు పెంచండి

### కేంద్ర ఆర్థిక మంత్రికి కేరళ సీఎం లేఖ



**న్యూఢిల్లీ :** జీఎస్టీ పరిహార కొరతను పూడ్చడంలో భాగంగా కేంద్రం తీసుకొచ్చిన ప్రతిపాదనకు ప్రతికూల గాలులు వీస్తున్నాయి. దేశంలోని ప్రతిపక్షపార్టీల పాలిత రాష్ట్రాలు మోడీ సర్కారు సవరించిన ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రం విధించిన రుణ పరిమితిని (రూ.1.10 ట్రిలియన్లు) తిరస్కరిస్తున్నాయి. కాగా, ఈ ప్రతిపాదనను జార్ఖండ్ ఇప్పటికే తోసిపుచ్చింది. అయితే, ఈ అంశంపై కేరళ సీఎం పినరయి విజయన్ స్పందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. కేంద్రం రూ.1.83 ట్రిలియన్ ( రూ. 1.83 లక్షల కోట్లు ) రుణం తీసుకోవాలని విజయన్ కోరారు. " కేంద్రం ప్రతిపాదించిన రూ.1.1 ట్రిలియన్‌లకు (రూ.1.10 లక్షల కోట్లు) బదులుగా.. స్పెషల్ విండో ఫెసిలిటీ కింద రుణ పరిమితిని రూ.1.83 ట్రిలియన్లకు పెంచాలి" అని లేఖంలో విజయన్ వివరించారు. స్నేహపూర్వక వాతావరణంలో ప్రస్తుత సమస్యకు పరిష్కారం చూపే విధంగా తదుపరి మరిన్ని చర్చలు జరపాలని కేంద్ర మంత్రికి ఆయన సూచించారు. ఒకవేళ కేంద్ర విధించిన ప్రతిపాదన ప్రకారమైతే.. బకాయిపడిన మిగిలిన రూ.73వేల కోట్లను పొందడానికి రాష్ట్రాలు మరో రెండేండ్లు వేచి చూడాల్సి ఉంటుందని ఎర్కొన్నారు. అయితే, ఇదే విషయమై మరికొన్ని రాష్ట్రాలు కేంద్రానికి లేఖలర రాసే అవకాశం ఉన్నది. కేంద్రం విధించిన రుణ పరిమితి ప్రతిపాదన ప్రస్తుత విధానంలో ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని పుదుచ్చేరి సీఎం పుదుచ్చేరి సీఎం వి. నారాయణస్వామి అన్నారు.

**కేంద్రం చొరవ తీసుకోవాలి : కేరళ ఆర్థిక మంత్రి**

జీఎస్టీ రుణపరిమితి విషయంలో కేంద్రం తప్పకుండా చొరవతీసుకోవాలని కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇసాక్ అన్నారు. " జీఎస్టీ పరిహార కొరత రూ.1.10 లక్షల కోట్లను రాష్ట్రాలకు చెల్లించే విషయమై మార్కెట్ నుంచి కేంద్రం రుణంగా తీసుకోవాలి. ఆపై రాష్ట్రాలకు రుణాలను అందించే విషయంలో మధ్యవర్తిగా కేంద్రం వ్యవహరించాలి" అని ఆయన తెలిపారు. అధిక మొత్తం రుణంగా తీసుకోవడం కేంద్రం ఆర్థిక లోటును ప్రభావితం చేయబోదని అన్నారు.




నవంబర్ 26న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా డార్జిలింగ్ జిల్లాలోని బిద్ధన్నగర్ వద్ద సిపిఎం జిల్లా కమిటీ నేతృత్వంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సిపిఎం కార్యకర్తలతో పాటు వేలాది మంది కార్మిక వర్గాలకు చెందిన ప్రజలు కూడా ఎర్ర జెండాలతో పాల్గొన్నారు.

## అర్నాబ్ గోస్వామికి సమన్లు జారీ చేయండి

- ముంబయి పోలీసులుకు బాంబే హైకోర్టు ఆదేశం
- రిపబ్లిక్ టివి తప్పుదోవ పట్టిస్తోంది : బార్క్

**ముంబయి:** టెలివిజన్ రేటింగ్ పాయింట్స్ (టిఆర్‌పీ) స్కామ్‌కు సంబంధించి ఈ నెల 6న నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రిపబ్లిక్ టీవీకి చెందిన ఎఆర్‌జి అవుట్ లయర్ మీడియా ప్రయివేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు సోమవారం విచారించింది. రిపబ్లిక్ టివి ఎడిటర్ ఇన్ చీఫ్ అర్నాబ్ గోస్వామికి నోటీసులు జారీ చేయాలని కోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. టిఆర్‌పి స్కామ్‌లో అతడిని నిందితుడిగా చేర్చాలంటే ముందుగా అతనికి సమన్లు జారీ చేయాలంది. వాటిని అందుకున్నట్టయితే అర్నాబ్ అధికారులు ముందు విచారణకు సహకరిస్తాడని ఆయన తరపు న్యాయవాది ఇచ్చిన వాంగ్మూలాన్ని సైతం న్యాయస్థానం రికార్డు చేసింది. తదుపరి విచారణ నవంబర్ 5కు వాయిదా పడింది. కాగా ఇదివరకే రిపబ్లిక్ టీవీకి చెందిన ఏఆర్‌జీ అవుట్ లయర్ మీడియా ప్రయివేట్ లిమిటెడ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ పిటిషన్‌ను విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. అలాగే, బాంబే హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. దీంతో రిపబ్లిక్ టీవీ బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ.. ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలని అందులో కోరింది.

**రిపబ్లిక్ టీవీ తప్పుదోవ పట్టిస్తోంది : బార్క్**

రిపబ్లిక్ టీవీ తప్పుదోవ పట్టిసోందని బ్రాడ్‌కాస్ట్ ఆడియెన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బీఏఆర్‌సీ-బార్క్) పేర్కొంది. ప్రస్తుతం కొనసాగుతున్న టీఆర్‌పీ స్కామ్ దర్యాప్తుపై తాము వ్యాఖ్యానించలేదనీ, చట్టపరంగా సదరు సంస్థకు అవసరమైన సహాయం మాత్రమే అందిస్తోందని బార్క్ తెలిపింది. ఈ మేరకూ ట్విట్టర్‌లో ఓ పోస్టు విడుదల చేసింది."రిపబ్లిక్ నెట్‌వర్క్ చర్యలతో బార్క్ ఇండియా చాలా నిరాశకు గురైంది. ప్రయివేటు, రహస్య సమాచారాన్ని బహిర్గతవ చేయడంతో పాటు దానిని తప్పుగా చూపిస్తోంది"అని పేర్కొంది.

## జెడియు కంటే ఎక్కువ సీట్లు గెలుస్తాం

### చిరాగ్ పాశ్వాన్

**పాట్నా :** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌పై ఎల్‌జెడి అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ విమర్శల దాడి కొనసాగించారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తాము జెడియు కంటే అధిక స్థానాల్లో గెలుస్తామని ఆయన సోమవారం ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. నితీష్ నేతత్వంలోని జెడియుకు ఓటు వేస్తే అది బీహార్ నాశనానికి దారితీస్తుందని వ్యాఖ్యానించారు. జెడియు కంటే అధిక స్థానాల్లో గెలుపొందడం ద్వారా బీహార్ ఫస్ట్ అన్న ప్రతిజ్ఞతో నూతన, యంగ్ బీహార్ నిర్మాణం సాధ్యమౌతుందని అన్నారు. జెడియు, బిజెపి ఉన్న ఎన్‌డిఎ కూటమి నుంచి బయటకు వచ్చిన ఎల్‌జెపి ఒంటరిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆ పార్టీ ఇప్పటికే 95 స్థానాలకు రెండు విడతలుగా అభ్యర్థులను ప్రకటించింది. జెడియు అధినేత నితీష్‌కుమార్‌పై మాటల దాడి చేస్తున్న చిరాగ్, ఇదే సమయంలో ప్రధాని మోడీపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నట్లుగా ఆయన చేస్తున్న ప్రకటనలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

## పదివేలకు పైగా రైల్వే క్యాటరింగ్ కార్మికులకు ఉద్వాసన!

**న్యూఢిల్లీ:** 300 రైళ్లలోని మినీ కిచెన్‌లను తొలగించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. వాటి స్థానాలను ఎసి-3 టైర్ కోచ్‌లతో భర్తీ చేయనుంది. మినీ కిచెన్‌లకు ప్రత్యామ్నాయంగా... ప్రయాణికులకు ప్యాక్ చేసిన ఆహారాన్ని అందించేందుకు ప్రధాన స్టేషన్లలో బేస్ కిచెన్‌లను ఏర్పాటు చేయాలని, లేదా ఇ-క్యాటరింగ్ ద్వారా అందించాలని రైల్వే యోచిస్తోంది. ఈ ప్రతిపాదనతో రైళ్లలో క్యాటరింగ్ వ్యాపారంపై ఆధారపడిన సుమారు పది వేల మంది కార్మికుల జీవనోపాధిపై కోలుకోలేని దెబ్బపడుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మెయిల్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, ప్రీమియర్ సర్వీస్‌లతోసహా 350 జతల రైళ్లు ఈ మినీ కిచెన్లను కలిగి ఉన్నాయి. ప్రతి కిచెన్‌లోనూ కుక్‌లు, వెయిటర్లతో కలిపి సుమారు 20 నుంచి 30 మంది సిబ్బంది ఉంటారు. వారి ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొంది. మినీ కిచెన్‌ల స్థానంలో ఎసి-3 టైర్ కోచ్‌లతో ఏడాదికి రూ.1400 కోట్ల అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు భారతీయ రైల్వే జనరల్ సెక్రటరీ ఎం.రాఘవయ్య పేర్కొన్నారు. ఇ- కేటరింగ్, రైల్వే స్టేషన్లలో బేస్ కిచెన్‌లతో ప్రయాణికులకు ఆహారాన్ని అందించడం ద్వారా ప్రయాణికుల క్యాటరింగ్ సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో రైల్వే ఫైనాన్షియల్ కమిషనర్ అన్ని జోన్‌లకు ఒక లేఖ రాశారని తెలిపారు. కొత్త పోస్టుల నిలుపుదల, రిటైర్ట్ అయిన సిబ్బందిస్థానంలో కొత్తవారిని నియమించవద్దని, అవుట్ సోర్స్ కార్యకలాపాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ నిధులను సమకూర్చడం వంటి ఇతర చర్యలతోపాటు ఆర్థికేతర శాఖలను మూసివేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు. రైల్వే యూనియన్లు, కార్యాలయాల భవనాలకు రంగులు వేయడం, వాటిని పునర్‌నిర్మించడం వంటి వ్యర్థ వ్యయాలను తగ్గించాలని, కనీసం రెండేళ్లపాటు నిలిపివేయాలని లేఖలో ఆదేశించారు.

## హత్రాస్ ఘటనలో సాక్ష్యాధారాల నాశనానికే ప్రతి అడుగు

### యుపి అధికారుల తీరుపై మాలిని భట్టాచార్య

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ అత్యాచార ఘటనకు సంబంధించి ఉన్న సాక్ష్యాధారాలను నాశనం చేసే దిశగా అక్కడి ప్రభుత్వం, అధికారులు వేస్తున్న ప్రతి అడుగు ఉందని సామాజిక కార్యకర్త, పశ్చిమ బెంగాల్ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్, జాతీయ మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు మాలిని భట్టాచార్య పేర్కొన్నారు. నిందితులు అధికారుల చేత రక్షించబడుతున్నారని, తాము ఏం చేసినా సులభంగా తప్పించుకోగలుగుతామన్న నమ్మకం వారిలో నెలకొందని అన్నారు. అధికారుల తీరు కారణంగా దళితులు, అణగారిన వర్గాల ప్రజలపై పలు రూపాల్లో అగ్రవర్ణాల దాడులు, దారుణాలు చోటుచేసుకుంటున్నాయని అభిప్రాయపడ్డారు. హత్రాస్ అత్యాచార ఘటనకు సంబంధించి ఆమె ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్ టెలిగ్రాఫ్ ఇండియా ఇంటర్వ్యూలో పలు విషయాలు పంచుకున్నారు. అత్యాచార ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపడంలో ఉద్దేశపూర్వక ఆలస్యం, ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో పోలీసులు ప్రదర్శించిన అలసత్వం, ఆలస్యంతో పాటు బాధితురాలికి తగిన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం, మెడికల్ సర్టిఫికెట్ తయారీలో చోటుచేసుకున్న ఆలస్యం, మరీ ముఖ్యంగా కుటుంబం అనుమతి, వారికి సమాచారం లేకుండా బాధితురాలి మతదేహాన్ని రాత్రికిరాత్రే దహనం చేసిన తీరు చేస్తుంటే ఈ ఘటనకు సంబంధించిన అన్ని సాక్ష్యాధారాలను ఒక ప్రణాళిక ప్రకారం నాశనం చేసేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారని మాలిని భట్టాచార్య పేర్కొన్నారు.

అత్యాచార దారుణానికి బాధితురాలే తొలి సాక్ష్యమని, ఘటన జరిగిన సెప్టెంబర్ 14వ తేదీనే ఆమె ఒక వీడియోలో ఈ విషయాన్ని వెల్లడించిదని భట్టాచార్య అన్నారు. తనపై జబర్దస్తు(అత్యాచారానికి ఉపయోగించే పదం) జరిగిందని ఆమె చెప్పారని అన్నారు. అదేవిధంగా అదేనెల 22న జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో కూడా ఇదే విషయాన్ని ఆమె చెప్పారని, తనపై దాడి చేసిన నలుగురి పేర్లను కూడా బాధితురాలు కలెక్టర్‌కు తెలిపారని భట్టాచార్య పేర్కొన్నారు. ఈ మరణ వాంగ్మూలానికి దర్యాప్తు సమయంలో చట్టపరంగా ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు.

## త్వరలో సిఎఎ అమలు : జెపి నడ్డా

**సిలిగురి (బెంగాల్):** దేశంలో పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ని త్వరలోనే అమలు చేస్తామని బిజెపి అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. కరోనా వైరస్ విజృంభిస్తుండటంతో... ఈ చట్టం అమలులో జాప్యం ఏర్పడిందన్నారు. ఉత్తర బెంగాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. మమతా సర్కార్ రాష్ట్రంలో ఉన్నా.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలే లక్ష్యంగా విభజించి పాలించే రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. బీజేపీలా అందరి అభివృద్ధి కోసం పని చేయడంలేదని విమర్శించారు. పౌరసత్వ సవరణ చట్టంతో అందరికీ ప్రయోజనం చేకూరుతుందనీ.. పార్లమెంట్‌లోనూ ఈ బిల్లు ఆమోదం పొందిందని గుర్తు చేశారు. ఈ చట్టం అమలుకు తమ పార్టీ కట్టుబడి ఉన్నదని నడ్డా వెల్లడించారు. కరోనాతో ఏర్పడిన పరిస్థితులు ప్రస్తుతం మెరుగుపడుతున్న తరుణంలో అతి త్వరలోనే సీఏఏ అమలు చేయనున్నట్టు తెలిపారు.

## పుంజుకుంటున్న చైనా ఆర్థిక వ్యవస్థ!




**బీజింగ్ :** కరోనా మహమ్మారి నుండి కోలుకున్న చైనా ఆర్థిక వ్యవస్థ క్రమంగా పుంజుకుంటోంది. మరోవైపు అమెరికా, యూరప్ దేశాలు ఇంకా కరోనాతో సతమతమవుతున్నాయి. సెప్టెంబరుతో ముగిసిన మూడు మాసాల కాలానికి చైనా ఆర్థిక వ్యవస్థ 4.9శాతం వృద్ధిరేటు సాధించినట్లు అధికారిక డేటా సోమవారం తెలిపింది. మొట్టమొదటి సారిగా కరోనాకు ముందున్న స్థాయికి రిటైల్ వ్యయం చేరుకుంది. ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి పెరిగింది. మాస్కులు, ఇతర వైద్య పరికరాల సరఫరాల ఎగుమతుల కారణంగా డిమాండ్ పెరగడంతో తయారీ కూడా పుంజుకుంది. కోలుకోవడమనేది నెమ్మదిగా విస్తరిస్తూండడంతో ప్రభుత్వ ఉద్దీపన ప్యాకేజీలమీద ఆధారపడడం తగ్గిందని కేపిటల్ ఎకనామిక్స్‌కి చెందిన జూలియన్ ఎవాన్స్ ఒక నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుత త్రైమాసికంలో అభివృద్ధి శీఘ్రగతిన ముందుకు సాగుతోందని వ్యాఖ్యానించారు. డిసెంబరులో కరోనా బారిన పడ్డ చైనా దాన్నుండి కోలుకుని పుంజుకుంటున్న మొదటి ప్రధాన దేశం. మార్చిలో కరోనా నియంత్రణలోకి వచ్చిందని, ఫ్యాక్టరీలు, దుకాణాలు, కార్యాలయాలన్నీ తిరిగి తెరుస్తున్నామని పాలక కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది.

**4.4శాతం క్షీణించిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ**

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ 4.4శాతం మేర కుంచించుకుపోగా, చైనా మాత్రం 2.7శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది అమెరికా, యూరప్, జపాన్‌ల్లో ఆర్థిక కార్యకలాపాలు క్షీణించగా, వృద్ధి చెందుతున్న దేశం చైనానే అని భావిస్తున్నారు. ఏడాది కాలంలో జూన్‌తో ముగిసిన మూడు మాసాల కాలానికి చైనా ఆర్థిక వ్యవస్థ 3.2శాతం మేర విస్తరించింది. అంతకుముందు త్రైమాసికానికి 6.8శాతం క్షీణించగా, దాని నుండి పుంజుకుని వృద్ధిని నమోదు చేసింది. మొత్తమ్మీద దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడగా పుంజుకుంటోందని జాతీయ గణాంకాల బ్యూరో ఒక నివేదికలో పేర్కొంది. అయితే, అంతర్జాతీయ వాతావరణం ఇంకా సంక్లిష్టంగా, తీవ్రంగానే వున్నందున, వైరస్ మళ్లీ విజృంభించకుండా నివారించడానికి చైనా చాలా ఒత్తిడిని ఎదుర్కొనాల్సి వుంటుందని హెచ్చరించింది. ప్రయాణాలు, వ్యాపార కార్యకలాపాలపై ఆంక్షలను అధికారులు ఎత్తివేశారు. విదేశాల నుండి వచ్చే ప్రయాణికులు మాత్రం రెండు వారాలు క్వారంటైన్‌లో వుండక తప్పదు.

గతేడాది కన్నా రిటైల్ అమ్మకాలు 0.9శాతం పెరిగాయి. డిమాండ్ పెరగడంతో సెప్టెంబరులో అమ్మకాలు 3.3శాతం పెరిగాయి. పారిశ్రామికోత్పత్తి కూడా గతేడాది ఇదే త్రైమాసికం కన్నా 5.8శాతం పెరిగింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో తీవ్ర స్థాయిలో వ్యాధి నిరోధక చర్యలు తీసుకున్నందున ఇతర దేశాల కన్నా చైనా తొందరగా కోలుకోగలదని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది చైనా ఆర్థిక వృద్ధి రేటు 1.8శాతం వుండగలదని అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనా వేసింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ 4.3శాతం క్షీణించగలదని పేర్కొంది.

## పిఎస్‌యులు మూలధన లక్ష్యాలను చేరాలి

- డిసెంబర్ నాటికి 75% పూర్తి
- ఆర్థిక మంత్రి సీతారామన్ సూచన
- ప్రథమార్థంలో 32% వ్యయం



**న్యూఢిల్లీ :** ప్రభుత్వ రంగంలోని 14 కంపెనీలు వచ్చే మూడు నెలల్లో తమ మొత్తం మూలధన వ్యయ ప్రణాళికల్లో 75 శాతం ఖర్చు చేయాలని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. కరోనా సంక్షోభం వల్ల అనేక ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోవడంతో తిరిగి పుంజుకోవడానికి కేంద్రం కసరత్తు చేస్తుంది. ఇందులో భాగంగా బొగ్గు, చమురు, సహజ వాయువు తదితర మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో మంత్రి సీతారామన్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలోని 14 పిఎస్‌యులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల కోట్ల మూలధనం వ్యయం చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాయి. కాగా ఇందులో డిసెంబర్ నాటికి కనీసం 75 శాతం వ్యయం చేసేలా సంబంధిత మంత్రిత్వ శాఖలు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని సీతారామన్ ఉన్నతాధికారులకు సూచించారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం (సెప్టెంబర్ ముగింపు నాటికి) ఈ పిఎస్‌యులు 37,423 కోట్లు వ్యయం చేశాయి. ఇది మొత్తం లక్ష్యంలో 32 శాతం మాత్రమే. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.1.11 లక్షల కోట్ల మూలధన వ్యయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా.. ఏకంగా రూ.1.16 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాయి. లక్ష్యం కన్నా 104 శాతం వ్యయం చేశాయి. మూలధన లక్ష్యాలను నెరవేర్చడానికి సంబంధిత మంత్రిత్వ శాఖలు మరింత సమన్వయంతో పని చేయాలని మంత్రి సీతారామన్ సూచించారు. దీని ద్వారా భారత వృద్ధి రేటుకు మద్దతునిచ్చేలా కృషి చేయాలని ఉన్నతాధికారులతో తెలిపారు. గడువు సమయంలో లక్ష్యాన్ని చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు మంచి పనితీరును కనబర్చడం ద్వారా కరోనా సంక్షోభం నుంచి బయట పడటానికి పెద్ద మార్గమన్నారు.

## 22న ట్రంప్, బిడెన్ తుది డిబేట్

**వాషింగ్టన్ :** గురువారం అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరగబోయే తుది డిబేట్‌కు చర్చాంశాలను డిబేట్ కమిషన్ సోమవారం విడుదల చేసింది. టెన్నెసిలోని నాషవిల్లెలో గురువారం ట్రంప్, బిడెన్‌లు చర్చకు సిద్ధపడనున్నారు. రాత్రి 9గంటలకు డిబేట్ ప్రారంభమవుతుంది. 90నిముషాల పాటు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతుందని కమిషన్ ప్రకటించింది. ఇందుకు గానూ ఆరు అంశాలను ఎంపిక చేసింది. అవి "కరోనాపై పోరు, అమెరికన్ కుటుంబాలు, అమెరికాలో జాతులు, వాతావరణ మార్పులు, జాతీయ భద్రత, నాయకత్వం". మొదటి చర్చలో ఏ విధమైన పద్ధతి అనుసరించారో ఇందులో కూడా అదే పాటిస్తారు. ప్రతి అంశానికి 15నిముషాలు సమయం ఇస్తారు. మోడరేటర్ క్రిస్టిన్ వాకర్ తన ప్రశ్న వెల్లడించిన తర్వాత ఇరువురు అభ్యర్థులకు స్పందించడానికిక చెరో రెండు నిముషాలు సమయం ఇస్తారు. మిగిలిన సమయాన్ని ఆ అంశంపై మరింత చర్చకు ఉపయోగిస్తారు. గత గురువారమే ఇరువురు రెండో దఫా డిబేట్‌లో పాల్గొనాల్సి వుంది. అయితే ట్రంప్‌కు కరోనా కారణంగా ఆన్‌లైన్ చర్చకు ట్రంప్ నిరాకరించడంతో అది జరగలేదు.

## బిడెన్ ఎన్నిక భారత్‌కు మంచిది కాదు!

### జూనియర్ ట్రంప్ వ్యాఖ్య

**న్యూయార్క్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జో బిడెన్ చైనా పట్ల మెతకగా వ్యవహరించవచ్చని, అందువల్ల ఆయన ఎన్నిక భారత్‌కు మంచిది కాదని ట్రంప్ కుమారుడు వ్యాఖ్యానించారు. బిడెన్‌పై అవినీతి ఆరోపణల గురించి పేర్కొంటూ తాను రాసిన పుస్తకం విజయవంతమైన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి తిరిగి ఎన్నిక కావడానికి చేపట్టిన ఎన్నికల ప్రచార బృందం బాధ్యతలను ట్రంప్ జూనియర్ చూస్తున్నారు. భారతీయ అమెరికన్ల కంటే మరెవరికీ ఇంతకంటే బాగా తెలియదని ఇక్కడ లాంగ్ ఐలాండ్‌లో మద్దతుదారుల సమావేశంలో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

## మారుతి నుంచి స్విఫ్ట్ స్పెషల్ ఎడిషన్




**న్యూఢిల్లీ :** దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి సోమవారం మార్కెట్లోకి తన ప్రీమియం హచ్ బ్యాక్ స్విఫ్ట్‌లో స్పెషల్ ఎడిషన్‌ను విడుదల చేసింది. సాధారణ స్విఫ్ట్‌తో పోల్చితే దీని ధర రూ.24,999 ఎక్కువగా ఉంది. ఎక్స్‌షోరూం వద్ద నూతన ఎడిషన్ ధరల శ్రేణీని రూ.5.19 లక్షల నుంచి రూ.8.02 లక్షలుగా నిర్ణయించింది. ప్రీమియం హచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో స్విఫ్ట్ తమ పోర్ట్‌పోలియోలో మంచి ప్రగతిని కనబర్చుతుందని మారుతి సుజుకి ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) శశాంక్ శ్రీవాస్తవా పేర్కొన్నారు. నూతన ఎడిషన్ స్విఫ్ట్ తమ అన్ని డీలర్‌షిప్‌ల వద్ద లభ్యం అవుతుందన్నారు. స్విఫ్ట్‌ను ఆవిష్కరించినప్పటి నుంచి ఇప్పటి వరకు 23 లక్షల యూనిట్లను విక్రయించినట్లు తెలిపారు.

## ఫ్లూ నివారణకు లీ హెల్త్ ఉత్పత్తులు




**హైదరాబాద్:** ఔషధ తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ లీ ఫార్మాకు చెందిన 'లీ హెల్త్ డొమెయిన్'.. ఫ్లూ నివారణకు స్టీమ్ మంత్ర, రోల్ ఆన్ కోల్డ్ పేరుతో ఆయుర్వేద ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఫ్లూ కారణంగా వచ్చే జలుబు, దగ్గు, గొంతు నొప్పి సమస్యకు ఇవి చక్కని పరిష్కారమని కంపెనీ తెలిపింది. ఆయుర్వేద గ్రంథాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా పరిశోధన అనంతరం వీటిని ప్రవేశపెట్టినట్టు కంపెనీ డైరెక్టర్ లీలా రాణి తెలిపారు. స్టీమ్ మంత్ర చుక్కలను వేడి నీళ్లలో వేసి ఆవిరి పట్టడం లేదా రోల్ ఆన్ కోల్డ్‌ను నుదురు, కణత, గొంతుపై రాయడం ద్వారా సత్వర ఉపశమనం ఉంటుందని పేర్కొన్నారు. కాంబో ప్యాక్ ధర రూ.135గా నిర్ణయిం చినట్లు తెలిపారు. రిటైల్, ఆన్‌లైన్‌లోనూ ఈ ఉత్పత్తులు లభ్యమవుతాయన్నారు.

**మొత్తం కరోనా కేసులు : 40,375,339**
**మొత్తం మృతులు : 1,119,589**
**వైరస్ సోకిన దేశాలు : 215**

| దేశం | కేసుల నమోదు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 8,390,547 | 2,24,761 |
| భారత్ | 7,552,262 | 1,14,670 |
| బ్రెజిల్ | 5,235,344 | 1,53,905 |
| రష్యా | 1,415,316 | 24,366 |
| స్పెయిన్ | 9,82,723 | 33,775 |
| ఫ్రాన్స్ | 8,97,034 | 33,477 |
| బ్రిటన్ | 7,22,409 | 43,646 |
| ఇరాన్ | 5,34,631 | 30,712 |
| ఇటలీ | 4,14,241 | 36,543 |
| జర్మనీ | 3,69,398 | 9,873 |
| బెల్జియం | 2,22,253 | 10,413 |
| చైనా | 85,685 | 4,634 |
| నెదర్లాండ్స్ | 1,68,280 | 6,768 |

## బొలీవియా ఎన్నికల్లో మొరేల్స్ పార్టీ ఘన విజయం

(మొదటిపేజీ తరువాయి)

కనబరిచారు. ఆర్సె విజయం పట్ల వెనిజులా అధ్యక్షుడు మదురో హర్షం వ్యక్తం చేశారు. ఎంఎఎస్‌కు ఇంతటి మహత్తర విజయం సాధించినందుకు బొలీవియా ప్రజలను ఆయన అభినందించారు. ఆర్సె విజయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ బొలీవియా ప్రజలు వీధుల్లోకి వచ్చి సంబరాలు జరుపుకున్నారు. గత ఏడాది అక్టోబరులో జరిగిన ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యతతో విజయం సాధించి నాల్గవ సారి అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన ఎవో మొరేల్స్‌ను పదవీచ్యుతుణ్ణి చేసి, దేశం నుంచి వెళ్లగొట్టిన కుట్రదారులకు ఇది పెద్ద చెంపపెట్టు. అమెరికా స్పాన్సర్డు కుట్రలో భాగంగా పోలీసులు, సైన్యం కలసి మొరేల్స్‌ను గత ఏడాది నవంబరులో అధ్యక్ష పదవి నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. ఎలాంటి ఎన్నిక లేకుండా అధికారం చేపట్టిన కన్సర్వేటివ్ అనీజ్ ప్రభుత్వంపై ప్రజలు నిరసనాగ్రహాలు వ్యక్తం చేయడంతో తిరిగి తాజాగా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 2020మే 13న జరగాల్సిన ఎన్నికలను కరోనాను సాకుగా చూపి వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ చివరికి ఈనెల 18న ఎన్నికలు నిర్వహించారు. చెదురు మదురు ఘటనలు మినహా మొత్తం మీద పోలింగ్ ప్రశాం తంగా జరిగింది. సాధారణంగా ఎన్నికల పోలింగ్ జరిగిన రోజే రాత్రి ఎనిమిది గంటలకు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వెల్లడించడం ఆనవాయితీ. కానీ, ఈ సారి అర్ధ రాత్రి దాకా వెల్లడించకపోవడంతో ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ప్రాథమిక ఫలితాల సరళి, ఎగ్జిట్ పోల్స్‌ను పోల్చి చూసుకుని ఎన్నికల సంఘం వాటి విడుదలకు అనుమతించింది. ఎన్నికల ఓట్లలెక్కింపు మొత్తం పూర్తయ్యేందుకు నాలుగైదు రోజులు పడుతుంది. అవిజేతగా నిలిచిన ఎంఎఎస్ నేత ఆర్సెను తాత్కాలిక అధ్యక్షురాలు అనీజ్ అభినందించారు. అధ్యక్షునిగా ఎన్నికైన ఆర్సె పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దేశాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేం దుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో శాంతియుతంగా పాల్గొని, తమ పార్టీకి బ్రహ్మాం డమైన విజయం చేకూర్చిన బొలీవియా ప్రజానీకానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అర్జెంటీనాలో ప్రస్తుతం తలదాచుకుం టున్న మాజీ అధ్యక్షుడు ఎవో మొరేల్స్ తిరిగి స్వదేశానికి వచ్చేందుకు ఇప్పుడు మార్గం సుగమమైంది. బొలీవియన్ సోషలిస్టులు ఇచ్చిన సందేశం చాలా స్పష్టంగా వుందని, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడరాదని ప్రజలను కోరుతున్నామని గత ఏడాది కాలంగా మనం జీవిస్తున్న ఈ పీడకలకు ఇక స్వస్తి పలుకుదామని మొరేల్స్ పేర్కొన్నారు. లాటిన్ అమెరికాలో రాజకీయ అస్థిరతకు ఒకప్పుడు మారుపేరుగా నిలిచిన బొలీవియాలో 2006లో ఎవో మొరేల్స్ అధికారం లోకి వచ్చినప్పటి నుంచి శాంతి, సుస్థిరత నెలకొన్నాయి.

**వెనిజులా అభినందనలు**

బొలీవియా ఎన్నికల్లో విజయం సాధించిన ఎంఎఎస్ అభ్యర్థి లూయిస్ అరెస్‌కు వెనిజులా ప్రభుత్వం అభినంద నలు తెలియచేసింది. ఈ మేరకు అధ్యక్షుడు మదురో ట్విట్టర్ లో సందేశమిస్తూ, ఇది 'మహత్తర విజయం" అని వ్యాఖ్యానిం చారు. మా సోదరుడు, మాజీ అధ్యక్షుడు ఎవో మొరేల్స్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆనాటి కుట్రను ఈనాడు ప్రజలు ఐక్యంగా, చైతన్యవంతంగా తమ ఓటు హక్కు ద్వారా ఓడిం చారని పేర్కొన్నారు. అధ్యక్షునిగా ఎన్నికైన లూయిస్ అరెస్‌కు, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన డేవిడ్ చోక్‌హునాకాకు వెని జులా అధ్యక్షుడు మదురరో అభినందనలు తెలియచేశారు. వాషింగ్టన్‌లో పన్నిన ఫాసిస్ట్ కుట్రకు మొరేల్స్ బాధితుడయ్యా డని ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు డెల్సీ రొడ్రిగజ్ గుర్తు చేసుకున్నారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence
**Registered Office:** Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam - 531 021, Andhra Pradesh, India.
**Corporate Office:** 2nd Floor, Serene Chambers, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034, Telangana, India.
Contact Numbers: Tel: +91 40 3980 4333; Fax: +91 40 3980 4320
E-mail: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com
**Corporate Identity Number: L24239AP2005PLC047518**

**NOTICE**

NOTICE is hereby given, pursuant to Regulation 29 and 47 of SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015, that a meeting of the Board of Directors of the Company will be held on Thursday, October 29, 2020, inter-alia, also to consider and approve the Un-Audited Financial Results of the Company for the quarter and half-year ended September 30, 2020; to consider the proposal for payment of interim Dividend for FY 2020-21 and fixation of record date for determining the eligibility of shareholders (if approved).
Further the Notice is also available on the website of the Company at www.lauruslabs.com.

By Order of the Board
For **Laurus Labs Limited**
Sd/- **G.Venkateswar Reddy**
Company Secretary

Place: Hyderabad
Date: October 19, 2020